వైద్య కళాశాలలను కాపాడుకుందాం



కుందుర్పి మండలం నిజవల్లి గ్రామంలో మాట్లాడుతున్న సమన్వయకర్త తలారి రంగయ్య



ఉరవకొండలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్టీ సమన్వయకర్త విశ్వ, రాష్ట్ర కార్యదర్శులు వజ్ర భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి

కుందుర్పి: రాష్ట్రంలో నిరుపేదలకు వైద్య విద్యను దూరం చేయడమే కాకుండా తనకు తొత్తులుగా వ్యవహరించే కొందరు ధనికులకు ఆదాయాన్ని చేకూర్చేందుకు సీఎం చంద్రబాబు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, నియోజకవర్గ పరిశీలకులు మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం కుందుర్పి మండలం నిజవల్లిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా నిజవల్లిలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రజలతో సంతకాలు సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మెడికల్ కాలేజీల పునరుద్ధరణకు కేవలం రూ.5 వేల కోట్లు కేటాయిస్తే పనులు పూర్తవుతాయన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్న అక్కసుతో చంద్రబాబు ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. విశాఖపట్నంలో గూగుల్ సెంటర్ ఏర్పాటు కోసం రూ.22 వేల కోట్లు కేటాయించడం పేదలకు టీడీపీ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఎంతటిదో తేటతెల్లమవుతోందన్నారు. అక్రమ మద్యంతో పేదల ఉసురు తీస్తున్నారు.. తాను ఎంపీగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో రూ.266 కోట్లు వెచ్చించి 68 చోట్ల బోర్లు వేయించి తాగునీరందించామని కాని ప్రస్తుత ఎమ్మెల్యే సురేంద్రబాబు గ్లాసు నీరు ఇవ్వకుండా గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా అక్రమ మద్యాన్ని అందిస్తూ పేదల ఉసురుతీస్తున్నారని దుయ్యబట్టారు. ఏడాదిగా స్థానిక ఎమ్మెల్యే అవినీతిని ఎండగడుతున్నా ఆయన మాత్రం మిన్నకుండిపోతున్నారన్నారు. ఇందుకు కారణం తాను ఏ చిన్న తప్పు చేసినట్లు నిరూపించినా తనను జైల్లో పెట్టమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో తిరిగి సుపరిపాలన రావాలంటే గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, మండల కన్వీనర్ రాయుడు, వాల్మీకి మాజీ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ నాగరాజు, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు భీమప్ప, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు తిప్పేస్వామి, నాగలక్ష్మి, అనుమేష్, మంజు కోఆపరేషన్ సభ్యుడు మాజీ, కంబదూరు బొమ్మయ్య, దొడగట్ట నారాయణ, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, నిజవల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా కాపాడుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండలోని వీరశైవ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ అనుబంధ సంఘాలు, నియోజకవర్గ, జిల్లా కమిటీలకు ఎంపికైన వారికి సమన్వయకర్తతో పాటు రాష్ట్ర కార్యదర్శులు వజ్ర భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్యంతో పాటు, పేదలు వైద్యవిద్య అభ్యసించేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 నూతన వైద్య కళాశాలలను మంజూరు చేయించారన్నారు. వాటిని అందుబాటులోకి తీసుకురావాల్సిన కూటమి ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి లబ్ధి చేకూర్చేందుకు నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ దిశగా వేస్తున్న చర్యలను ఆపి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య కళాశాలలు నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టినట్లు వెల్లడించారు. సంతకాలు సేకరించిన పత్రాలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులతో కలసి గవర్నర్‌కు అందిస్తారన్నారు. తద్వారా వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 28న ఉరవకొండలో జరిగే నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉరవకొండ వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, పార్టీ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, బెళుగుప్ప, కూడేరు మండలాల కన్వీనర్లు ఎర్రిస్వామి రెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, డొనేకల్లు రమేష్, సోమశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, బైరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శివలింగ, భరత్‌రెడ్డి, జల్లిపల్లి దేవేంద్ర, యోగేంద్రరెడ్డి, సుద్దాల వెంకటేష్, చాబాల జగదీష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం నాయకులు బసవరాజు, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, బీసీ సెల్ జిల్లా నాయకులు కురుబ గోవిందు, మైనార్టీ నాయకులు బళ్లారి ఆసిఫ్, శర్మాస్, జీఎంఎస్ మీరం బాషా, బెలగల్ షమ్ము, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీలో కష్టపడేవారికి సముచిత స్థానం



పంచాయతీ నూతన కమిటీ ఏర్పాటు చేస్తున్న నాయకులు

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడి పనిచేసే వారికి పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలానాగరాజు, సర్పంచ్ గంగాధర పేర్కొన్నారు. ఆదివారం జంబుగుంపల పంచాయతీ నూతన కమిటీని వారు ఎన్నుకున్నారు. పంచాయతీ కన్వీనర్‌గా సన్నమచ్చంద్రప్ప, ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ఎస్ఎన్ ఆంజనేయులతోపాటు 18 మందిని వివిధ విభాగాల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈరన్న, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి నాయకులు ఈ.రాము, ఓబుళపతి, ఆర్.నాగప్ప, మంగళి రంగప్ప, మహేంద్ర, మాజీ డీలర్ నాగరాజు, ఓబన్న, అప్పాజిపాళ్యం రఘు, సీనియర్ నాయకులు రామప్ప, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడికి సన్మానం



మహేంద్ర రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మహేంద్రరెడ్డిని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మొట్టమొదటి సారిగా వచ్చిన ఆయన్ను మాజీ ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా జిల్లా కార్యదర్శి యర్రంపల్లి కృష్ణమూర్తి, దొడగట్ట నారాయణ, కామక్కపల్లి మల్లి, పార్టీ మున్సిపల్ విభాగం కన్వీనర్ సుధీర్, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షులు చరణ్, కైరేవు ప్రతాప్, కిరణ్, మల్లికార్జున, రామిరెడ్డి, మంజు, భాస్కర్, మంజుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని ఆర్.కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశులు మాతృమూర్తి నారాయణమ్మ (82) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌని లక్ష్మీ కాంతారెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, నేత్రపల్లి ఆర్టీ లక్ష్మీ కాంతారెడ్డి, జెడ్పీటీసీ మహేష్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప తండాలో 'స్వచ్ఛ' కార్యక్రమం



గ్రామంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

బెళుగుప్ప: తండా ఎంప్లాయీస్ యూనియన్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం బెళుగుప్ప తండాలో 'స్వచ్ఛ తండా' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి, మురుగునీటి పూడిక తీయించి, దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు మార్గంలో అడ్డుగా ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. పరిశుభ్ర వాతావరణంలో పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నెల 21న నరక చతుర్దశి, 22న శ్రీదుర్గాదేవి వార్షిక పూజా ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

కూడేరు: టపాసుల దుకాణాదారులు ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని సీఐ రాజు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నాణ్యత లేని టపాసులను విక్రయించవద్దన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ రామానాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన డీఎస్పీ రవిబాబు

రాయదుర్గంటౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు చిరస్మరణీయమని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని రాయదుర్గం పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అర్బన్ సీఐ జయనాయక్, రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అమరవీరులకు నివాళులర్పించి, శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. మెగా రక్తదాన శిబిరంలో వంద మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. మెగా రక్తదాన శిబిరానికి దాతలు, యువత, డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడేట్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పెద్ద ఎత్తున తరలిరాగా అనంతపురం జీజీహెచ్ వైద్య బృందంచే రక్తం సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సోలార్ ప్రాజెక్టు రైతులకు మేలు'



రైతులతో శ్రీశక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ ప్రతినిధులు

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలం రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని శ్రీ శక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ చైర్మన్ చెరకు అనీల్ దయాకర్ అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో సోలార్ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులతో సమావేశమయ్యారు. గ్రామంలో 2,300 ఎకరాలు భూములు ఇవ్వడానికి ముందుకొచ్చిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎకరాకు ఏడాదికి లీజు రూ.33 వేలు ప్రకారం కంపెనీ అందిస్తుందన్నారు. ఏటా 10 శాతం లీజు పెంచుతామన్నారు. సోలార్ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. సోలార్ ప్రాజెక్టుకు వచ్చే లాభాల్లో 90 శాతం విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల కల్పనకు కంపెనీ ఖర్చు చేస్తుందని వివరించారు. సమావేశంలో కంపెనీ డైరెక్టర్ జయంత్, జేటీ రామచంద్ర, రీజనల్ డైరెక్టర్ సూర్యం, తెలంగాణ డైరెక్టర్ బాబన్న, రైతులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: మాలేపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత, మజీ వైస్ ఎంపీపీ ఆనందప్ప మాతృమూర్తి మూలింటి లింగమ్మ(73) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గ్రామానికి చేరుకుని లింగమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అన్నివేళలా అండగా ఉంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మండల కన్వీనర్లు ఎమ్మెస్ రాయుడు, గోళ్ల సూరి, చంద్రశేఖర్ రెడ్డి, మార్కెయార్డ్ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, సర్పంచ్ విరుపాక్షి, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గ్రామ అధ్యక్షులు వీరేష్, నాయకులు రామాంజనేయులు, తిమ్మయ్య, మహాలింగ తదితరులు పాల్గొన్నారు.

అడవి గొల్లపల్లి వాసి ఉంతకల్లులో మృతి



మృతి చెందిన గొల్ల గోవింద

బొమ్మనహాళ్: శెట్టూరు మండలం అడవి గొల్లపల్లికి చెందిన గొల్ల గోవింద(54) ఆదివారం బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లులో మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోవింద శుక్రవారం రాత్రి ఉంతకల్లు గ్రామంలోని పాండురంగస్వామి దర్శనం కోసం వచ్చి.. శనివారం కూడా ఉంతకల్లులోనే ఉన్నాడు. ఆదివారం తెల్లవారు జామున గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లి.. అక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకున్నారు. బంధువులు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా గోవింద మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని బంధువులు పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. మృతుడికి భార్య సుశీలమ్మ, కుమార్తె ఉంది.

వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రటాన్ని ఊరేగిస్తున్న వాల్మీకి కులస్తులు

బెళుగుప్ప: గంగవరంలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి కులస్తులు మహర్షి వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ప్రత్యేక పూలతో అలంకరించి మంగళవాయిద్యాలు, డప్పు మోతల నడుమ ఊరేగించారు. వాల్మీకి జయంతి వేడుక సందర్భంగా అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

శుభకార్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 20వ వార్డు పైతోటలో ఆదివారం జరిగిన యశ్వంత్, మహాలక్ష్మి వివాహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, పైతోట సంజీవప్ప, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, నాయకులు మురళీమోహన్‌రెడ్డి, సునార్ ఇస్మాయిల్, పైతోట రఘు, ముత్తయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా కమలపాడు రోడ్డు





గుంతలమయమైన రహదారి

వజ్రకరూరు: కమలపాడు గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రహదారి మొత్తం దెబ్బతిని రాళ్లు తేలడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల వల్ల వాహనదారులు కిందపడి ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం మెరుగుపరచాలని వాహనదారులు కోరుతున్నారు.

మార్మోగిన శివ నామస్మరణ



కూడేరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కూడేరు సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మాసశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శంభో శంకర.. హరహర మహాదేవ అంటూ శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పార్వతీపరమేశ్వరుల స్వయంభు జోడు లింగాలకు అర్చకులు శివ శంకర శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వాములు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గ్రామాలతో పాటు జిల్లా కేంద్రం అనంతపురం నుంచి భక్తులు హాజరై జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నీలగిరిస్వామికి పూజలు



వజ్రకరూరు: మండల కేంద్రంలోని కురుబ వీధిలో భక్తుల కొంగుబంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

22న ఎస్వీజీఎం కళాశాలలో జాబ్‌మేళా

కళ్యాణదుర్గం: ఈనెల 22న స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో పుష్కల్ ఆగ్రో టెక్ లిమిటెడ్, జేకేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హర్షలత, జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.కవిత, పుష్కల్ ఆగ్రో టెక్ ప్రతినిధి జగదీష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సేల్స్ ఆఫీసర్ 20 పోస్టులు, ఆఫీస్ బాయ్-2, డీఎండీ(అగ్రికల్చర్ బీఎస్సీ) 4 పోస్టులు ఉన్నాయని తెలిపారు. టెన్త్/ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 19–35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 8374448848, 97.05906621 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏపీ మెడికల్ ఫీల్డ్ స్టాఫ్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

కళ్యాణదుర్గం: ఏపీ మెడికల్ ఫీల్డ్ స్టాఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (మేల్) కళ్యాణదుర్గం డివిజన్ కమిటీ ఎంపిక ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోంలో జరిగినట్లు అధ్యక్షుడు రవిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం డివిజన్ అధ్యక్షుడిగా రవిరాజు, సెక్రటరీగా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం, జాయింట్ సెక్రటరీగా తిరుపాలయ్య, కోశాధికారిగా గంగరాజు, ఈసీ సభ్యులుగా వీరశేఖర్, హనుమంతరాయుడు, సురేష్‌బాబు, గోవిందరాజులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. మెడికల్ ఫీల్డ్ స్టాఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

బుక్కరాయసముద్రం: పుట్టగొడుగుల పెంపకం లాభదాయమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పుట్ట గొడుగులకు డిమాండ్ ఉందన్నారు. నిరుద్యోగ యువత పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ పొంది కుటీర పరిశ్రమలాగ అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి పుట్ట గొడుగుల పెంపకంలో మెలకువలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

జీవన ఎరువుల వాడకం ఎంతో మేలు

రసాయన మందులకంటే జీవన ఎరువులు వాడకం ఎంతో మేలు అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో జీవన ఎరువుల వారోత్సవాల సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ జీవన ఎరవుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ, ఎరువుల లభ్యత, పథకాలపై కేవీకే విస్తరణా శాస్త్రవేత్త చందన అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగుపై వాటిలో రాయితీలపై శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు.



వై.విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి

దీపావళి శుభాకాంక్షలు



వై.శివరామిరెడ్డి

కళ్యాణదుర్గం/ఉరవకొండ/రాయదుర్గం టౌన్: కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ సయన్వయకర్తలు తలారి రంగయ్య, వై.విశ్వేశ్వరరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. చీకటిని తరిమికొట్టి వెలుగులను నింపే ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని వారు ఆకాంక్షించారు.

అలాగే ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాల చీకట్లు తొలగి దీపాల కాంతుల వెలుగులు నిండాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నరకాసున్ని వధించి నరులందరి జీవితాల్లో వెలుగును నింపిన సత్యభామ శౌర్యానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని తెలిపారు.

రైతులకు మొక్కల పంపిణీ



బ్రహ్మసముద్రంలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ పనరసింహ మూర్తి మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా లక్షకు పైగా మొక్కలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికైనా బ్రహ్మసముద్రంలో దాదాపు 10 వేలకు పైగా మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నీటి సౌకర్యం కలిగిన రైతులకు ఎకరాకు 132 ప్రకారం మామిడి, కొబ్బరి, ఎర్రచందనం, మహాగని వంటి మొక్కలను అందిస్తామని, ఆసక్తి కలిగిన రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ హనుమప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం



వినీతను సత్కరిస్తున్న నాయకులు

వజ్రకరూరు: గడేహోతూరుకు చెందిన ఉపాధ్యాయురాలు కురుబ వినీతను ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివి డీఎస్సీలో టీచర్‌గా ఎంపికైనందుకు వినీతను జిల్లా కేంద్రంలోని శ్రీ ద్వారకా చలమారెడ్డి ఫంక్షన్ హాలులో కురుబ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి, మొమెంటో అందజేశారు.